ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 29 జనవరి 2025

ఘనంగా మల్లన్న జాతర

మల్లాపూర్, జనవరి, 28 (ఆంధ్ర జ్యోతి): మల్లాపూర్ మండలం రేగుంటలోని మంగవారం మల్లన్నస్వామి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలోని మూల విరాట్‌కు ఉదయం నుంచి ప్రత్యేకపూజలు జరిపినారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తి శ్రద్ధలతో నాగవెల్లి, శివసత్తుల అగ్ని గుండాలు తదితర కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని మంగళ వారం భక్తులు అన్నదానం నిర్వహించారు. అంతక ముందు ఆలయంలో పూజారి భాస్కర్ హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హన్మాన్ సేవా సమితి సభ్యులు జక్కుల మల్లేశం, ఇట్టె గంగాధర్, గణేష్, పవన్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కోరుట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కోరుట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళ వారం మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులకు కాలనీ వాసులు వినతి పత్రం అందించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా సమస్యలను కాలనీవాసులు వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎంబేరీ నాగభూషణం నాయకులు పుప్పాల ప్రభాకర్, లక్ష్మణ్ కేసీఆర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



వరి వైపు రైతుల మొగ్గు

జిల్లాలో సాగైన పంటల వివరాలు	
వరి	2,50,720 ఎకరాలు
మొక్కజొన్న	34,106 ఎకరాలు
జొన్న	287 ఎకరాలు
అనుములు	3 ఎకరాలు
శనగలు	30 ఎకరాలు
పల్లి	252 ఎకరాలు
ఆవాలు	129 ఎకరాలు
పెసర	34 ఎకరాలు
సజ్జ	16 ఎకరాలు
మినపప్పు	152 ఎకరాలు

- జల వనరులు పుష్కలంగా ఉండడమే కారణం
- జిల్లాలో 2,50,720 ఎకరాల్లో వరి నాట్లు

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా యాసంగిలో వరి సాగుకు ఎక్కువ శాతం రైతులు మొగ్గు చూపుతున్నారు. 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందుతుండడంతో యాసంగిలో వరి నాట్లు ఎక్కువగా వేశారు. ఫలితంగా గత యేడాది సాధారణ సాగు కంటే అధికంగా సాగైనట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ముప్పాతిక శాతానికి పైగా విస్తీర్ణంలో వరినే సాగు చేస్తున్నారు. జిల్లాలో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ, వరద కాలువల ద్వారా నీరు అందుబాటులో ఉండడంతో రైతులు వరి సాగును పెంచారు. ఏ చెరువు కట్ట కింద చూసినా వరి నాట్లు దర్శనమిస్తున్నాయి.

● తగ్గిన మొక్కజొన్న సాగు

జిల్లాలో ఈసారి మొక్కజొన్న సాగు తగ్గింది. కొన్ని రోజులుగా వ్యవసాయ అధికారులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలో 71 క్లస్టర్లలో ఏఈఓలు ఈ వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. రైతులు వేసిన పంటల విస్తీర్ణాన్ని బట్టి వ్యవసాయ దిగుబడులు ఏ మేరకు వస్తాయో అంచనా వేస్తారు. దీని ఆధారంగా ఆయా పంటల సాగును బట్టి కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తారు.

● కాలువలు, చెరువుల్లో సమృద్ధిగా నీరు

వానాకాలం సీజన్‌లో కురిసిన భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, చెరువులు నిండుకుండల్లా మారడంతో వాటి ఆయకట్టు కింద రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. దీనికి తోడు భూగర్భ జలాలు అధికంగా ఉండడంతో యాసంగి సాగు అంచనాలకు మించి జరుగుతోంది. అయితే యాసంగి కావడంతో రైతులు ఎక్కువగా దొడ్డు రకాలనే సాగు చేస్తున్నారు. దీంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. అన్ని మండలాల్లోని ప్రాథమిక సహకార కేంద్రాల వద్ద యూరియా సరఫరాకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా పంటల వివరాలు నమోదు



యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సాగవుతున్న వివిధ పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో ఏఈవోలు పర్యటించి పంట ల వివరాలను సంబంధిత యాప్‌లో పొందుపరుస్తున్నారు. జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో అత్య ధికంగా వరి పంట సాగు అవుతోంది. నీటి లభ్యత కారణంగా రైతులు వరి సాగుకు ముందుకు వస్తున్నారు.

-రాంచంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

హిందువులకు ఖర్గే క్షమాపణలు చెప్పాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం

జగిత్యాలరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో జరుగుతున్న మహాకుంభమేళాలో స్నానాలు చేస్తే దేశంలోని పేదరికం పోదని చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే హిందువులకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఖర్గే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పెద్దగంగారాం, కోశాధికారి ధశరథరెడ్డి, రూరల్ మండల మాజీ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఎవరితోనైనా కలిసి పని చేస్తా

● జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎవరితోనైనా కలిసి పని చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 202 మందికి కల్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓట్లు వేసి గెలిపించిన ప్రజలే నాకు ముఖ్యమన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మద్దతు ఇవ్వడంతో పాటు బీజేపీ ఎంపీ అరవింద్‌తో కలిసి పని చేస్తానన్నారు. పట్టణంలోని ప్రతి వార్డుకు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.5 కోట్లతో తారక రామానగర్‌లో ఏటీసీ అడ్వాన్స్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలోని 5 వేల కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చామని, నూకపెల్లి అర్బన్ కాలనీని జగిత్యాల మున్సిపల్‌లో విలీనం చేయనున్నామన్నారు. జగిత్యాల పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం రూ.2 కోట్లతో అర్బన్ పార్క్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు అడువాల జ్యోతి, శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పంబాల రామ్ కుమార్, బాలె శంకర్, అబ్దుల్ ఖాదర్, చుక్క నవీన్, క్యాదాసు నవీన్, ముస్కు నారాయణ రెడ్డి, హరీష్, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే నడపాలి
● జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ 8

బీసీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
● బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ 8

'లక్ష డప్పులు-వేయి గొంతులు' విజయవంతం చేయాలి

జగిత్యాల అర్బన్, జనవరి (ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్‌లో వచ్చే నెల 7న జరిగే లక్ష డప్పులు- వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్ ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన మాదిగల జైత్ర యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పోరాటం ఢిల్లీ వరకు వినిపించేలా మాదిగ బిడ్డలు తరలి రావాలని కోరారు. అంతకు ముందు పట్టణంలోని తహసీల్ చౌరస్తానుంచి మంచి నీళ్ల బావి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలె శంకర్, మల్యాల సతీష్, రామంచ భరత్, దూమాల గంగన్న మాదిగలు, మాదిగ ఉప కులాలు, గాయకులు, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

కార్గోపై అవగాహన ర్యాలీ

కోరుట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ సేవలపై మంగళవారం కార్గో సిబ్బంది అవగాహన ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి కార్గో లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గో సేవలపై వ్యాపారులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

రాయికల్, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆరు పథకాల ఊసే లేదని ఆమె అన్నారు. రాయికల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో దావ వసంత మాట్లాడుతూ పట్టణంలో రూ.22 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, రాయికల్‌ను గ్రామం నుంచి పట్టణంగా మార్చిన ఘనత అప్పటి ఎంపీ కవితదే అని అన్నారు. మొదటిసారిగా రాయికల్ మున్సిపాలిటీకి ఎన్నికైన పాలకవర్గం చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పాలకవర్గ సభ్యులంతా పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని అన్నారు. ఆర్థిక వనరులు సమకూర్చిన కేసీఆర్, కవితలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సొంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యే ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపెట్టాలని దావ వసంత డిమాండ్ చేశారు. రాయికల్ మున్సి పాలిటీకి కృషి చేసిన కవిత చిత్రప టానికి నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. రాయికల్ నూత నంగా ఏర్పడిన ప్రెస్ జేఏసీ కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రాయికల్ పట్టణ, మండల అధ్యక్షులు ఎలిగేటి అనిల్, బర్కం మల్లేష్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు ఎలగందుల ఉదయశ్రీ, మారంపెల్లి రాణి, మాజీ కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, సాయికుమార్, సువర్ణసత్యానారాయణ, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల సమన్వయసమితి సభ్యులు గంగారాం, మాజీ ఉపసర్పంచ్ సాగర్ రావు, మండల మైనార్టీ విభాగం అధ్యక్షుడు చాంద్ పాషా, మాజీ కోఆప్షన్ మెంబర్ సోహైల్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు నీరటి శ్రీను పాల్గొన్నారు.

పాడి పశువులకు సమీకృత ఆహారం అందించాలి

● జిల్లా పశు వైద్యాధికారి లక్ష్మీమనోహర్

జగిత్యాలరూరల్, జనవరి28 (ఆంధ్ర జ్యోతి): పాడి పశువులకు సమీకృత ఆహారం అందించడం ద్వారా అధిక పాల దిగుబడి పొందవచ్చునని జిల్లా పశు వైద్యా ధికారి లక్ష్మీమనోహర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబి రాన్ని మంగళవారం ఆయన ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ దూడల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాడి గేదెలకు ఖనిజ లవణ విటమిన్ మిశ్రమాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి నరేష్‌రెడ్డి, ఎల్ఎస్ఏలు నాగేందర్, రవీందర్, రమేష్, కార్యాలయ సిబ్బంది బక్కయ్య, పోచయ్య, అహ్మద్ పాల్గొన్నారు.

గురుకులాల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ సత్య ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, జనవరి28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ మరియు మైనార్టీ గురుకులాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ మరియు మైనార్టీ శాఖల సమీక్ష సమావేశం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకేమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మరమ్మతుల కోసం కేటాయించిన నిధులు ఎంత మేరకు ఖర్చు చేశారు అనే విషయాలపై ఆరా తీశారు. విద్యార్థుల మెనూ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల దీక్ష

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపిస్తూ మండలంలోని భూషణరావుపేటలో రైతులు మంగళవారం దీక్ష చేపట్టారు. గత వానాకాలం, యాసంగి పంటలకు సంబంధించి రైతు భరోసా ఎగ్గొట్టడమే కాకుండా రెండు లక్షల రుణమాఫీ సగం మందికి కూడా చేయలేదని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని సీఎంకు ఆ పీఠం మీద కూర్చుండే అర్హత లేదని విమర్శించారు. రైతులను అడుగడుగునా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు. అనంతరం తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి గ్రామ శాఖ అధ్యక్షుడు బద్దం మహేందర్, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం రాజారెడ్డి, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



భూషణరావుపేటలో దీక్ష చేస్తున్న రైతులు

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటించాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

జగిత్యాల అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. నూతన స్థాయీ సంఘం సమావేశంలో మాతృ సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ కోసం అమలవుతున్న నియమ నిబంధనలను కమిటీతో చర్చించారు. ప్రతి నెల 5వ తేదీలోపు ఫామ్ ఎఫ్, ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరిచి జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ కనకదుర్గ, విశ్వభారతి, జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.శ్రీనివాస్, పిల్లల వైద్య నిపుణుడు పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ సత్యప్రసాద్



వెల్గటూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

వెల్గటూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. మంగళవారం వెల్గటూర్ మండలం లోని వెల్గటూర్, చెగ్యాం, గుల్లకోట గ్రామాలలో నర్సరీలు, జామ తోట, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలను ఆకస్మికంగా సందర్శించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. డంపింగ్‌యార్డు, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో రక రకాల పండ్ల మొక్కలు పెంచాలని అన్నారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసుదన్, డీపీవో మదన్‌మోహన్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

● డీఈవో రాము



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాము

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నతంగా రాణించాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. మల్యాల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాల సాధనకు విద్యార్థులు కష్టపడి చదవాలని అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ తప్పనిసరిగా అలవర్చుకోని తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు.

విద్యార్థులకు సబ్జెక్ట్ పరంగా మెళకువలు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్.జయసింహరావు, కరీంనగర్‌కు చెందిన ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లుతో పాటు వైద్యుడు సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

కార్గో సేవలను వినియోగించుకోవాలి

● ఆర్టీసీ రీజియన్ ఏటీఎం రామారావు

రాయికల్, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): రాయికల్ పట్టణ, మండల ప్రజలు కార్గో లాజిస్టిక్ సేవలను విని యోగించుకోవాలని ఆర్టీసీ రీజియన్ ఏటీఎం రామారావు అన్నారు. రాయి కల్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో కార్గో లాజిస్టిక్స్ కౌంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్గో సేవలపై మార్కెటింగ్ టీమ్‌తో కలిసి కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. మరిన్ని వివరాలకు రాయి కల్ ఏజెంట్ శ్రీకాంత్ 9949970018లో సంప్రదించాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములకు కొత్తగా పాసుబుక్కులు పొందిన రైతుల నుంచి రైతుభరోసా కోసం మంగళవారం ఏఓ యోగిత దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 569 మందికి కొత్తగా పాసు బుక్కులు వచ్చాయని వారిని దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

రౌడీషీటర్‌కు ఆరునెలల జిల్లా బహిష్కరణ

సిరిసిల్ల క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన మహ్మద్ మోయిస్ పాషా అలియాస్ మోయిజ్(34) అనే రౌడీ షీటర్‌ను ఆరునెలల జిల్లా బహిష్కరణ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె.కృష్ణ తెలిపారు. మంగళవారం అతడికి బహిష్కరణ నోటీసు అందజేశామన్నారు. మోయిజ్ ఎక్కడైనా కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 11కేసుల్లో నిందితుడిగా ఉంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజాశాంతికి, సామాన్య ప్రజలకు భంగం కలిగిస్తున్నాడని వస్తున్న ఫిర్యాదుల మేరకు అతనిపై తెలంగాణ సామాజిక వ్యతిరేక, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఆరునెలలు జిల్లా నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ధర్మపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గత నెలలో ఒక వ్యక్తిని చంపి కాల్చి వేసిన కేసులో మెరుగు లస్మయ్య అలియాస్ లక్ష్మణ్ అనే నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. గతంలో ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న నేరెళ్ల గోపాల్ అలియాస్ గోపాల్ రమేష్, గండికోట శేఖర్ అనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నేరెళ్ల గ్రామానికి చెందిన మెరుగు లస్మయ్యకు సంబంధం కలిగి ఉందని నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తాండ్ర్యాల శివారులో మంగళవారం ఓ వాహనం ఢీకొన్న ఘటనలో రుద్రంగికి చెందిన నగిరి విజయ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం విజయ్ బైక్‌పై తాండ్ర్యాలకు వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎక్స్ రోడ్డు వద్ద వెనక వైపు నుంచి మినీ ట్రక్ ఢీకొట్టింది. దీంతో విజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదా కేసులో ఐదు సంవత్సరాల జైలు

మెట్‌పల్లి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో భూతగాదా కేసులో నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్యకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి డి. నాగేశ్వరరావు తీర్పు వెలువరించినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వర్షకొండ గ్రామానికి చెందిన రేగుంట చిన్న లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన సల్వాల రాజేందర్ అనే వ్యక్తిపై 2017లో భూ తగాదాల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేశాడు. బాధితుడి భార్య సల్వాల పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ బి.రాము నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు సాక్షులను విచారించి నిందితుడు రేగుంట చిన్న లక్ష్మయ్యకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల జరిమానా విధించింది. కేసులో నిందితుడికి శిక్ష పడేటట్లు చేసిన ఎస్‌ఐ రామును, కోర్టు కానిస్టేబుల్ కవితను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

విద్యుదాఘాతంతో అడవి జంతువుల మృత్యువాత

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులో ఓ రైతు అమర్చిన విద్యుత్ తీగల కారణంగా అడవి జంతువులు మృత్యువాత పడ్డాయి. పంటలపై దాడి చేసి ధ్వంసం చేస్తుండటంతో విద్యుత్ తీగలు అమర్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధించిన నలుగురిపై కేసు

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని వేధించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోతారంకు చెందిన బీనవేని అరుణ్‌కు మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన నిత్యశ్రీతో రెండేళ్ల కిందట వివాహమైంది. అప్పుడు రూ.10 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అందజేశారు. మళ్లీ రూ.10లక్షలు తీసుకురావాలంటూ తరచూ భర్త అరుణ్‌తో పాటు అత్త మీనమ్మ, బావ హరీశ్, తోటి కోడలు రాజ్యలక్ష్మీ వేధింపులకు గురిచేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు ఆలయాల్లో దొంగతనం

తిమ్మాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెగిలిపాలెం గ్రామంలో ఒకే రోజు మూడు దేవాలయాల్లో దొంగతనాలు జరిగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనాలకు పాల్పడ్డట్లు తెలిపారు. పోచమ్మ గుడిలో అమ్మవారికి వేసిన బంగారు అభరణాలు, పెద్దమ్మ గుడిలో కండ్లు బంగారు పుస్తెలు, రేణుక ఎల్లమ్మ గుడిలో హుండీ పగులకొట్టి అందులో ఉన్న నగదు ఎత్తుకెల్లారు. హుండీలో ఏడాది కాలంగా భక్తులు వేసిన నగదు ఉన్నట్లు తెలిపారు. ఒకే రోజు మూడు ఆలయాల్లో దొంగతనం జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

అద్దెకు ఉన్న ఇంటికే కన్నం

● చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నమ్మి గదిని అద్దెకు ఇస్తే ఆ ఇంటికే ఓ యువకుడు కన్నం వేశాడు. మండల కేంద్రంలోని బందారపు గంగిరెడ్డి ఇంటిలో చోరీకి పాల్పడిన సంఘటనలో రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కాసోజి విజయ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. అతడి వద్ద నుంచి 5.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని గంగిరెడ్డి ఈ నెల 27న తన ఇంటికి గడియ వేసి భార్యతో కలిసి బయటకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు గంగిరెడ్డి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన విజయ్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించారు. గత ఎనమిదేళ్లుగా గంగిరెడ్డి ఇంటిలో అద్దెకు ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నానని చెప్పాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి గంగిరెడ్డి ఇంటిలో చోరీకి పాల్పడ్డట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడులు

వీర్నపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాల్‌సింగ్ తండాలో ఎస్‌ఐ ఎల్లాగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. తండాలో ఓ కుటుంబానికి చెందిన 70 లీటర్ల బెల్లం పానకం, 12 కిలోల బెల్లం ధ్వంసం చేసి 2 లీటర్ల గుడుంబాను స్వాధీనపర్చుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుల్ మల్లన్న,కార్తీక్,శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వైరు చోరీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న విద్యుత్ మోటార్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అపహరించుకుపోయారు. తీగను కట్ చేయడంతో కాలనీలో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి నీటి సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మల్కాపూర్ సమీపంలో పెద్దపులి సంచారం

బోయినపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం మల్కాపూర్ గుడ్డేలుగుల గుట్ట సమీపంలో పొలం వద్దకు వెళ్లిన రైతులకు పెద్దపులి కనిపించడంతో భయాందోళనకు గురై గ్రామానికి చేరుకున్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు తెలుపడంతో వేములవాడ ఎఫ్ఆర్‌వో తన సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. పులికి ఎలాంటి హాని కలిగించవద్దని ప్రజలను రైతులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతానికి పులి ఆనవాళ్లు కనబడలేదని, బుధవారం ఉదయం పెద్దపులి పాదముద్రలు గమనిస్తామని ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు.



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు



బెలూన్లను ఎగురవేస్తున్న ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి, ఐజీలు, సీపీ

పోరాటాల గడ్డ.. క్రీడల అడ్డాగా మారింది

● ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి ● రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి పోరాటాల గడ్డ కరీంనగర్ ఇప్పుడు క్రీడల అడ్డాగా మారిందని ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి క్రీడా పతాకాన్ని ఎగురవేసి, జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నిర్వహించుకుంటున్న ఈ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడకారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఎగురవేయాలన్నారు. జాతీయపోటీల్లో పతకాలు సాధించే పోలీస్ క్రీడాకారులకు మూడు లక్షల నగదు పురస్కారంతోపాటు ఉద్యోగాల్లో పదోన్నతి కల్పిస్తున్నామన్నారు. ఐజీపీ మల్టీ జోన్-1 ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి కలుగుతుందన్నారు. స్పోర్ట్స్ ఐజీపీ ఎం రమేష్ రెడ్డి మాట్లాడుతూ నిత్య జీవితంలో క్రీడలను ఒక భాగంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, జగిత్యాల ఎస్పీ ఎ లక్ష్మీనారాయణ, కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభం ప్రకాశ్, కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.



ఫుట్‌బాల్‌ను కిక్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి

జాతీయ పోలీస్ క్రీడలే లక్ష్యంగా...

- ఎం వెంకటేష్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారుడు, కరీంనగర్



గతంలో ఖోఖో క్రీడాకారుడిగా 34 జతీయస్థాయి పోటీల్లో, ఒక అంతర్జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొన్నాను. గత సంవత్సరం పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరాను. ఈ సంవత్సరం రాజన్న సిరిసిల్ల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ప్రతి సంవత్సరం నిర్వహించాలి...

- గుండా వీరన్న, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, టీజీఎస్పీ చెల్యాయి



గతంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఈ సంవత్సరం కరీంనగర్‌లో నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఈ రాష్ట్రస్థాయి పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహించాలి. ఈ పోటీలతో క్రీడాకారులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుంది. గతంలో కబడ్డీ క్రీడల్లో పలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభచాటాను.

వివిధ సంస్థల్లో క్రీడా కోటాను అమలు చేయాలి

ఉట్నూరు రోహిత్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, నిజామాబాద్



రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను కరీంనగర్‌లో నిర్వహించడం అభినందనీయం. వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభచాటే క్రీడాకారులకు వివిధ సంస్థల్లో క్రీడాకోటాను అమలు చేయాలి. క్రీడాకోటాను అందిస్తున్న పోలీస్, రైల్వేస్, ఆర్మీ, వివిధ సంస్థల్లో కోటా శాతాన్ని పెంచాలి.

ప్రోత్సాహకాలను అందించాలి...

- ఎం భరత్‌చంద్ర, జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, కొత్తగూడెం



ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉంది. ప్రతి సంవత్సరం ఈ క్రీడల నిర్వహణకు కృషి చేయాలి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులకు ప్రోత్సాహకాలను అందించాలి. ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగావకాశాలు కల్పించాలి. గతంలో అనేక జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న రాజన్న జోన్ జట్టు

● ఆకట్టుకున్న మార్చ్‌ఫాస్ట్

రాష్ట్రంలోని 20 పోలీస్ జోన్ల నుంచి హాజరైన క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. రంగురంగుల ట్రాక్ సూట్లతో 20 జట్లుగా పోలీస్ క్రీడాకారులు అతిథులకు అందించిన గౌరవ వందనం అందరినీ అలరించింది.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్

● క్రీడా జ్యోతిని వెలిగించిన డీజీపీ...

శనివారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే ఈ క్రీడల ప్రారంభోత్సవానికి గుర్తుగా రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ముందుగా జతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు క్రీడా జ్యోతిని మైదానంలో ప్రారంభించి డీజీపీకి అందజేశారు. క్రీడాకారులు మోటార్ బైక్‌పై నిర్వహించిన క్రీడాజ్యోతి రిలే ఆకట్టుకుంది.

ధరణిలో భూములు కోల్పోయినవారికి న్యాయం చేయాలి

● సిరిసిల్ల జిల్లాలో 7 వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా ● రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ నాయకుల వినతి

తంగళ్లపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధరణిలో భూములు కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన భూ బాధితులతో కలిసి సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సుద్దాల ప్రభాకర్‌లు హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలా ఏళ్ల నుంచి నిరుపేదల ఆధీనంలో ఉండి పాసుబుక్కులు ఉన్నప్పటికీ ధరణిలో నమోదు చేయకుండా అన్యాయం చేశారని తెలిపారు. అదే భూమిని అధికారులు అనర్హులైన వారిపై ధరణిలో నమోదు చేశారని తెలిపారు. అప్పటినుంచి అక్రమంగా రైతుబంధు పొందుతూ అవినీతికి పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకొని డబ్బులను రికవరీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామంలో 377 సర్వేనెంబర్‌లోని 120 మందికి చెందిన దాదాపు 350 ఎకరాల భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొని పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. భూమిని కోల్పోయి ఉపాధి లేక రోడ్డున పడ్డారన్నారు. చాలామంది దళితుల భూములను బలవంతంగా తీసుకొని పరిహారం ఇవ్వలేదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని చట్టంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం పాటించలేదని పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం పెద్ద లింగా పూర్ గ్రామంలో 50 ఏళ్ల క్రితం సుంకరులుగా పనిచేసిన రజకులకు ఇచ్చిన 12 ఎకరాల 36 గుంటల భూమిని మరొకరికి వీఆర్వో అక్రమంగా పట్టా చేశాడని తెలిపారు. అక్రమ పట్టాలు పొందిన వారి నుంచి భూమిని రికవరీ చేసి బీఆర్ఓతో పాటు అక్రమ పట్టాల పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో సుమారు ఏడు వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని.. ప్రభుత్వ అవసరాల కోసం తిరిగి తీసుకోవాలని అక్రమ కబ్జాదారులపై, సహకరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని సీబీఐ విచారణ జరిపించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

సౌదీలో రోడ్డు ప్రమాదం

- మెట్‌పల్లి వాసి మృతి



రమేష్(ఫైల్)

మెట్‌పల్లి టౌన్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి పట్టణం అనుబంధ గ్రామమైన రేగుంటకు చెందిన కాపెల్లి రమేష్ (30) అనే యువకుడు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 27న సౌదీ అరేబియలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడికక్కడే మృతి చెందారు. అదే విధంగా ఇబ్రహీంపట్నం వర్షకొండ గ్రామానికి చెందిన మరో ముగ్గురు అదే బస్సులో ఉండగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాపెల్లి రమేష్ 3 నెలల క్రితం ఉపాధి కోసం సౌదీ వెళ్లాడు అక్కడ జుబైల్‌లోని ఏసిఐసి సర్వీస్ కంపెనీలో వారం క్రితం పనిలో కుదిరాడు. సోమవారం ఉదయం పని నిమిత్తం ఏసిఐసి సర్వీస్ కంపెనీకి చెందిన బస్సులో బయలు దేరారు. 26 మంది ఉద్యోగులతో వెళ్తున్న బస్సు జిజాన్ అరంకో రిఫైనరీ రోడ్డులో ట్రక్కును ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న రమేష్ అక్కడిక క్కడే మృతి చెందాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రమేష్‌కు భార్య శ్వేత, ఇద్దరు కూతుర్లు నందన, శ్రీవల్లిలు ఉన్నారు. వర్షకొండకు చెందిన ముగ్గురు అంకిత్, శ్రీధర్, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహంను త్వరగా స్వగ్రామం తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయిందని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 35 సంవత్సరాలు ఉంటుంది. మృతదేహం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670764, 9000884443 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

కుల బహిష్కరణపై కేసు

జగిత్యాల రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లి గ్రామానికి చెందిన దొందరి గంగారాంతో పాటు మరో నాలుగు కుటుంబాలను కులబహిష్కరణ చేసిన రవి, మహేశ్, నడిపయ్య, చిన్నన్న, రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ



రోబోటిక్ కిట్లు అందిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి సాంకేతికతపై అవగాహన కల్పించే లక్ష్యంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 పాఠశాలల్లో శిక్షణ పూర్తి కాగా పట్టణంలోని వెంకంపేట, గీతానగర్ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు తంగళ్లపల్లి, వెంకటాపూర్, ఎల్లారెడ్డిపేట, గొల్లపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 643 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలను నేర్పించారు. అంతేకాకుండా విద్యార్థులకు రోబోటిక్స్ కిట్లను అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన ఒడిశా బృందం

చొప్పదండి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఒడిశా రాష్ట్రానికి చెందిన పలు సహకార సంఘాల పాలకవర్గాలు సందర్శించాయి. ప్యాక్స్ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు గురించి చైర్మన్ వెల్మ మల్లారెడ్డి ఒడిశా బృందానికి వివరించారు. సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని, రైతులకు ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే అందిస్తున్నామని తెలిపారు.



చొప్పదండి ప్యాక్స్ ఎదుట ఒడిశా బృందం

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కొత్త నైపుణ్యాలను పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాలని ఓయూ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. శివరామకృష్ణ అన్నారు.మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణలో భాగంగా రెండోరోజు రూల్ ఆఫ్ ఇండస్ట్రీస్-4.0 సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యానుఫాక్చరింగ్ రంగంలో ఆటోమేషన్, రోబోటిక్ విభాగాలు క్రియాశీలకంగా ఉన్నాయన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ పరిజ్ఞానం వస్తు ఉత్పత్తి మాత్రమే కాకుండా ఆధునిక వ్యవసాయ రంగం, వైద్య విధానం తదితర వాటిల్లో ఉపయోగిస్తున్నారన్నారు. వస్తు ఉత్పత్తిని సులభతరం చేసి నాణ్యమైన వస్తువులను ఉత్పత్తి చేసి మానవ జీవితాన్ని మరింత సౌకర్యవంతంగా చేయడమే ఇండస్ట్రీ-4.0 లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. శంకర్,ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొమురయ్య పాల్గొన్నారు.

మృతురాలు మంచిర్యాల వాసిగా గుర్తింపు

గంగాధర, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివా రులో అనుమానాస్పదంగా మృతి చెందిన మహిళ మంచిర్యాల వాసిగా పోలీసులు ప్రాథమి కంగా గుర్తించారు. సోమవారం కురిక్యాల శివారులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన పోలీ సులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మహిళ మృతి వార్తా పత్రికల్లో, సోష ల్ మీడియాలో చూసిన మంచిర్యాలకు చెందిన వారు పోలీసులకు సమాచారం అందించారు.

ప్రస్తుతం మహిళ మృతదేహం కరీంనగర్ మార్చురీలో భద్రపరచారు. మంచిర్యాల నుంచి ఇక్కడికి ఎందుకు వచ్చింది, ఎవరు తీసుకువచ్చారు, అనే కోణంలో పోలీ సులు విచారణ చేస్తున్నారు.పోలీసులు ప్రాథమికంగా హత్యగా నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా హత్యనా, ఆత్మహత్యనా అనేది తేలుతుందని ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

● నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లి..

కాసిపేట : మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రానికి చెందిన మేడ భరత్ ఆసిఫాబాద్ కుమరం భీం జిల్లా పెంచికల్‌పేటకు చెందిన మమత(30)తో ఐదేళ్లుగా సహ జీవనం చేస్తున్నాడు. వీరికి ఒక బాబు ధ్రువన్ (4) ఉన్నాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. నిత్యం మమతను భరత్ వేధించేవాడు. మమతకు తల్లిదండ్రులు లేరు. మమత గత ఏడాది అక్టోబరులో మమత ఇంటి నుంచి వెళ్లి బంధువుల వద్ద ఉంటుంది. శనివారం దుకాణానికి వెళతానని చెప్పి బాబుతో కలిసి బయటకు వెళ్లి తిరిగి లేదు. దీంతో బంధువులు సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా బాబుతో కలిసి ఓ కారులో ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల శివారు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభించింది. పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను చూసిన బంధువులు ఆ మృతదేహం మమతదిగా గుర్తించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఆలీ ఏక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

బద్ది పోచమ్మకు బోనం మొక్కులు

వేములవాడ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పువాయిద్యాలతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మ ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి ఆలయంలోకి చేరుకున్నారు. ముందుగా భక్తులు పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని అమ్మవారికి పట్నం వేసి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించి కల్లుసాకతో మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్లో బారులుతీరిన భక్తులు

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

ఎండపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో మోడు బారిన వృక్షం ప్రమాదకరంగా మారింది. ఈ వృక్షం ఎండిపోయి సంవత్సరం గడిచింది. రాజారాంపల్లి జాతీయ రహదారి పక్కన ఈ వృక్షం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కరీంనగర్-రాయపట్నం జాతీయ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు నడుస్తుంటాయి. రోడ్డుపై వాహనాలు వెళ్లేటప్పుడు పడితే ప్రయాణికులకు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వృక్షాన్ని తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



రాజారాంపల్లిలో ప్రమాదకరంగా ఉన్న వృక్షం



సమావేశమైన వృద్ధులు..

పండుటాకులకు ఆసరా

వృద్ధులకు అండగా 'చార్వాక సంక్షేమ సంఘం'

ఎల్లారెడ్డిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్న పండు టాకులకు ఆసరాగా నిలుస్తోంది చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘం. మలిసంధ్యలో తనవాళ్లే నిరాదరణకు గురైన వారందరికీ అండగా నిలవాలన్న ఓ వృద్ధుడి ఆలోచనతో ఈ సంఘం ఏర్పాటైంది. గ్రామంలో వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు.. ఒకరికొకరు సహకరించుకుంటున్నారు. ఆపద వస్తే తామున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. తలా కొంత డబ్బులు పోగు చేసుకుని ఆర్థిక అవసరాలకు సహకారం అందిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధులు సంఘంగా ఏర్పడి పొదుపు చేసిన డబ్బులతో స్వంతంగా సంఘ భవనాన్ని నిర్మించుకున్నారు.

● **ఏకతాటిపైకి వచ్చి..**

మండలంలోని పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లో వృద్ధులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కార మార్గం కోసం సంఘం ఏర్పాటు చేయాలనే ఆలోచన గ్రామంలోని వృద్ధుడు లచ్చాగౌడ్‌కు వచ్చింది. రెండు గ్రామాల్లో కొడుకులు, కోడళ్ల కారణంగా అవస్థల పాలవు తున్న వృద్ధులకు అండగా నిలవాలనుకు న్నారు. ఆయ గ్రామాల్లోని వృద్ధులతో చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘంగా ఏర్పడాలని నిర్ణయించుకున్నారు. అందుకు 2008లో 250 మంది వృద్ధులతో చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెలకు రూ.50తో పొదుపు ప్రారంభించారు. ప్రస్తుతం 400 మందితో వృద్ధుల సంక్షేమ సంఘం కొనసాగుతోంది. రూ.15లక్షలతో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రతి ఆరు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసుకొని తమ యోగక్షేమాలపై చర్చించుకుంటున్నారు. కొడుకులు, కోడళ్ల నుంచి ఏమైనా సమస్యలుంటే వారిని సమావేశానికి పిలిపించి మందలిస్తూ కంటికి రెప్పలా చూసుకోవాలని అంటున్నారు. వృద్ధులకు ఏ ఆపద వచ్చినా పరిష్కరిస్తున్నారు. దాంతో ఆ రెండు గ్రామాల్లో వృద్ధులు ఆనందంగా గడుపుతున్నారు.

● **రాజా మెట్టెక్కిన వృద్ధులు..**

తమను కన్నబిడ్డలు పట్టించుకోకపోవడం లేదంటూ పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధులు రాజా మెట్టెక్కరు. పోలీసులను ఆశ్రయించరు. గ్రామంలోని వృద్ధుల సంక్షేమ సంఘానికి చేరుకుంటారు. తమ కష్టాలను వివరిస్తారు. దాంతో ఆయా కుటుంబాల సభ్యులను పిలిపించి మంచిగా చూసుకోవాలని సంఘం సభ్యులు మందలిస్తారు. తమ మాట కాదంటే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరిస్తారు. తద్వారా సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తున్నారు.

● **ఆర్థిక అవసరాలకు సహకారం..**

చార్వాక వృద్ధుల సంక్షేమ సంఘంలోని సభ్యుల ఆర్థిక అవసరాలకు సహకారం అందిస్తున్నారు. ఒక్కో సభ్యుడికి రూ.20వేల నుంచి రూ.50 వేల వరకు రూపాయి వడ్డీకి ఇస్తూ ఆర్థిక ఇబ్బందులను తొలగిస్తున్నారు. ప్రస్తుతం రూ.15లక్షలతో నిరాటంకంగా సాగిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం లేకపోవడం వల్ల భవన నిర్మాణానికి నిర్ణయించుకున్నారు. పదిర గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన వ్యక్తి తనకున్న రూ.20లక్షల విలువైన నాలుగు గుంటల స్థలాన్ని వృద్ధులకు విరాళంగా అందజేశారు. దాంతో యేడాది కిందట ఆ స్థలంలో సుమారు రూ.11లక్షలతో సంఘ భవనం నిర్మించుకున్నారు.

● **నిరాదరణకు గురైన వారి సమస్యల పరిష్కారానికి కృషి**

మంచిగా చూసుకుంటుండ్రు

- పల్లెల లస్మవ్వ, వృద్ధురాలు



గ్రామంలోని వృద్ధుల సంక్షేమ సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నా. ఏదైనా సమస్య వస్తే సభ్యుల దృష్టికి తీసుకెళతా. మా ఇంటిలో కొడుకులు, కోడళ్లు మంచిగా చూసుకుంటుండ్రు. ఆర్థిక అవసరాలకు డబ్బులను తీసుకుని సంతోషంగా ఉంటున్నా.

ఏ ఆపద వచ్చినా ముందుంటాం...

- కంచర్ల నర్సయ్య, సంఘం అధ్యక్షుడు



రెండు గ్రామాల్లోని నాలాంటి వృద్ధులు పడుతున్న బాధలను మేమే పరిష్కరించుకునేందుకు సంఘం ఏర్పాటైంది. సభ్యులకు ఏ ఆపద వచ్చినా ముందుంటాం. పదిర గ్రామంలోని గుల్లపెల్లి హన్మయ్య అనే వృద్ధుడికి ఎవరూ లేకపోవడంతో మేమే సపర్యలు చేశాం.

ప్రభుత్వం కృషి చేయాలి

- తాళ్లపల్లి లచ్చాగౌడ్, సంఘం వ్యవస్థాపకుడు



పదిర, హరిదాస్‌నగర్ గ్రామాల్లోని వృద్ధుల అవస్థలను కళ్లారా చూశా. పరిష్కార మార్గాన్ని వృద్ధులతో సంఘంగా ఏర్పడితే పెద్దగా సాధించవచ్చని అనుకున్నాం. 2008లో సంఘం ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయాలి.

వర్గీకరణ అమలు వేగవంతం చేయాలి

● కవ్వంపల్లి నేతృత్వంలో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు



హైదరాబాద్‌లో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

మానకొండూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు అవసరమైన శాసన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మానకొండూర్ శాసన సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ పర్యటన విజయవంతంగా ముగించుకుని స్వరాష్ట్రానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని కవ్వంపల్లి నేతృత్వంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామ్యేల్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం వివిధ రాష్ట్రాలుల ప్రక్రియను చేపట్టాయని, అందులో భాగంగానే రాష్ట్రంలో వర్గీకరణకు శ్రీకారం చుట్టాలన్నారు.

డ్రైవర్ల నైపుణ్యంతోనే ప్రమాదాల రేటు తక్కువ

● డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం



ప్రశంసా పత్రాలు అందుకున్న డ్రైవర్లతో అధికారులు

భగత్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్ల నైపుణ్యంతోనే ప్రమాదాల రేటు తక్కువగా ఉంటుందని కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. మంగళవారం ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ డ్రైవర్ వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ మానవ తప్పిదాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ బస్సులు నడపాలన్నారు. అత్యంత ప్రమాద రహిత సర్వీసు డ్రైవర్లు సిహెచ్ అయ్య (హుజూరాబాద్), అల్తాఫ్ హుస్సేన్ (కరీంనగర్-2), బి.రాజు (సిరిసిల్ల)లతోపాటు ప్రతీ డిపో నుంచి 33 మంది డ్రైవర్లను డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, ఆర్‌ఎం రాజు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సత్యనారాయణ, భూపతిరెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు విజయమాధురి, మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, రీజియన్‌లోని తొమ్మిది డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో సంఘం పటిష్టానికి చర్యలు

● **బీసీ సాధికారత సంఘం**

ఉమ్మడి జిల్లా కన్వీనర్ పొలాస నరేందర్

వేములవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ సాధికారత సంఘాన్ని గ్రామస్థాయిలో పటిష్టం చేస్తామని సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ పొలాస నరేందర్ అన్నారు. మంగళవారం వేములవాడలో జరిగిన పట్టణ బీసీ సాధికారత సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ యువత, మహిళ సంక్షేమం, ఐక్యతతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు సంఘం తరఫున ప్రయత్నం చేస్తామని అన్నారు. బీసీ సాధికారత సంఘాన్ని మరింత పటిష్టం చేసే క్రమంలో వేములవాడ పట్టణ మహిళ అధ్యక్షురాలుగా నీతూ, ప్రధాన కార్యదర్శిగా చింతలఠాణ తేజస్విని, జిల్లా మహిళ అధ్యక్షురాలుగా గుజ్జె తార, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పడిగేల మానస, ప్రధాన కార్యదర్శిగా మెరుగు జల, వేములవాడ పట్టణ యువత కమిటీ అధ్యక్షులుగా గంగ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా యిన్నారపు సాగర్, జిల్లా యువత అధ్యక్షులుగా అంకారపు మహేష్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జె శివరామ్‌ను నియమించినట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలోని 28 వార్డులకు త్వరలోనే కమిటీలు నియమిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు తూషుకారి సత్యయ్య ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్, ఉపాధ్యక్షులు ఉయ్యాల భూమయ్య, ఎం.ఏ.రాహిల్, ఎండీ అజ్మత్ పాషా, అన్నారపు సాయి కుమార్, జిల్లా బీసీ సాధికారత సంఘం ప్రచార కార్యదర్శి అంబటి సంతోష్, ఉపాధ్యక్షులు గోగికార సత్యం, ఆదివాసి ప్రతినిధి మైలారం రాము, కార్యనిర్వాహక కార్యదర్శి సిహెచ్.రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొలాస నరేందర్

రాజకీయాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిచేయొద్దు

సుభాష్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిచేయొద్దని కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ భాగస్వామ్య పక్షాల నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన జేఏసీ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులతోపాటు కేంద్ర సహాయ మంత్రి హాజరయ్యారని, కలెక్టర్, పోలీసు కమిషనర్ అన్ని ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులందరూ ఒకేసారి వేదికపై రావడంతో కొంత తోపులాట జరిగిందని, దీనిపై మంత్రులు అసహనాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను బాధ్యురాలిని చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు కలెక్టర్ అహర్నిశలు పని చేస్తున్నారని, అలాంటి కలెక్టర్‌పై ప్రజాప్రతినిధులు అసహనంతో మాట్లాడడం ఎంతవరకు సబబని అన్నారు. దీనిపై ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి విచారం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ పట్ల చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో భవిష్యత్‌లో తమ మద్దతు ఉండదని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెప్పే విధానం తమకు తెలుసన్నారు. కాలం ఎప్పుడు ఒకేలా ఉండదని, ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు గుర్తెరగాలని అన్నారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు, టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ఎం హుస్సేని దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళిచరణ్, కార్యదర్శి అరవిందరెడ్డి, డీడీ నాగరాజు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి, ఆసోసియేట్ అధ్యక్షుడు పొలుల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ శారద, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మంజిత్‌సింగ్, ఎండీ వాసిక్, టీఎన్‌జీవో టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, కార్యదర్శి సుమంత్‌రావు, పోలు కిషన్, కేశవరెడ్డి, లింగయ్య, నవీత, సునీత, విజయలక్ష్మి, మల్లు రాజేశ్వరరావు, కొండయ్య, అజయ్, ప్రవీణ్, అభిషేక్, గిరిధర్‌రావు, సత్యం, అనిల్, నరేశ్, జోనల రవి, అజయ్, బాలాజీ, అంజయ్య రమేశ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ భాగస్వామ్య పక్షాలు

ప్రమాదకరంగా మూల మలుపులు



ఆరెపల్లి బస్ స్టేజీ సమీపంలో ఉన్న మూల మలుపు

కొడిమ్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల రహదారిపై మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై ప్రతి నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి. కొడిమ్యాల మండలం దొంగలమర్రి పోలీస్ చెక్‌పోస్ట్ (జేఎన్‌టీయూ ఎక్స్ రోడ్) నుంచి తురుకకాశీనగర్ వరకు ఉన్న మూల మలుపులు ఉన్నాయి. కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు ఢీ కొట్టడం, వేగంగా వచ్చిన వాహనాలు అదుపు తప్పి బోల్తా పడడంలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. వాహనాలు ఢీ కొట్టడంతో ఈ రోడ్డుపై పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. మండలంలోని పూడూర్ అనుబంధ గ్రామమైన ఆరెపల్లి వద్ద, పూడూర్ శివారులో ఎల్లమ్మ గుడి వద్ద ప్రమాదకరమైన మూల మలుపు ఉన్నది. మండలంలోని పూడూర్ బస్టాప్ సమీపంలో గతంలో స్పీడ్ బ్రేకర్లు ఉండేవి. కొన్నేళ్ల క్రితం వాటిని తొలగించారు. దీంతో వాహనాలు వేగంగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి.



బోల్తా పడ్డ వ్యాన్(ఫైల్)

ఫిలిగ్రీ కళాకారుల ఉత్పత్తుల పరిశీలన



ఫిలిగ్రీ కళకు చెందిన కళాకారుల ఉత్పత్తులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కరీంనగర్ కల్చరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిగ్రీ ఉత్పత్తులను, తయారీ కేంద్రాన్ని మంగళవారం దేశంలోని ఎస్ఆర్ఎం శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. 2007లో జీఐ గుర్తింపు ఉన్న ఫిలిగ్రీ సంస్థలో వెండి తీగల ఉత్పత్తులు, కళాకారుల పనితీరును సభ్యులు పరిశీలించారు. కళాకారులతో వివరాలు తెలుసుకున్నారు. కరీంనగర్ ఫిలిగ్రీ సొసైటీ బాధ్యులు అశోక్, వెంకటేశ్, అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఐఏఆర్ఏసీ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సుభాకర్ షా నాయకత్వంలో బృంద సభ్యులు పాల్గొన్నారు.

'రంగు'ల కళ..

● నాటక రంగంలో రాణిస్తున్న జేఏవో రంగు వెంకట నారాయణ

● ఉద్యోగం చేస్తూనే నాటికల ప్రదర్శన

గణేశ్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆయన నలుగురికి వినోదం పంచడానికి సాంఘిక నాటకాలలో పాత్రలను పోషిస్తారు. ప్రజలను చైతన్య పరచడానికి సామాజిక అంశాలపై ప్రదర్శనలు ఇస్తారు. వృత్తి రీత్యా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ తీరిక సమయంలో కళాకారుడిగా తన నైపుణ్యాన్ని చాటుతున్నారు. ఆయన కరీంనగర్‌లోని విద్యుత్ శాఖ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రంగు వెంకటనారాయణ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఎన్నో 300 ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకుల నుంచి మన్ననలు పొందడంతోపాటు ఉత్తమ కళాకారుడిగా పలు అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డు దక్కించుకున్నారు. 'ప్రేమ ఈజ్ ఈక్వల్ టూ' నాటక ప్రదర్శనలో ఉత్తమ విలన్‌గా అవార్డు దక్కించుకున్నారు. తొలిసారిగా ప్రభుత్వ దర్శకత్వంలో మన ఊరి ముచ్చట్లు ఛానల్ వారు నిర్మించిన 'చీర దిగిందని తీర్చి కుదిరింది' అనే షార్ట్‌ఫిలిం లో నటించారు. దీనిని మూడు లక్షల మంది వీక్షించారు. ఆ తర్వాత ఎన్నో షార్ట్ ఫిలింలలో నటించారు. రంగు వెంకటనారాయణ నటించిన క్లిక్, లాల లీల, చెల్లని పైసలు, దొంగలు, ఖరీదైన జైల్లు, స్వప్నం రాల్చిన అమృతం, ఈ లెక్క ఇంతే, చీకటి పువ్వు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వందలాది ప్రదర్శనలతో ఎన్నో బహుమతులు అందుకున్నారు. 2006లో నిజామాబాద్‌లో ప్రేమ ఈజ్ ఈక్వల్ టు, 2010 నంద్యాలలో జరిగిన చెల్లని పైసలు నాటికలో ఆయనను కాంస్య నంది అవార్డు వరించింది. 2017 కర్నూల్‌లో ఈ లెక్క ఇంతే, 2016 రాజమండ్రిలో మా ప్రేమకు న్యాయం కావాలి, 2023 గుంటూరులో చీకటి పువ్వు నాటికలకు ఉత్తమ కాంస్య నంది అవార్డు అందుకున్నారు. విద్యుత్ శాఖ భద్రతా వారోత్సవాల సందర్భంగా లఘు చిత్రాలను, నాటకాలను వేసి విద్యుత్ భద్రత గురించి గృహిణులకు, విద్యుత్ సైనికుడు, ఈ స్మార్ట్ కరెంట్ బిల్లుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు ఇచ్చారు. చదువుకునే రోజుల్లో విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో రంగు వెంకట నారాయణ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించారు. కరీంనగర్ జట్టును రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ సారి గెలిపారు. బాస్కెట్‌బాల్ క్రీడలోనూ ఆయనకు ప్రవేశం ఉంది.



ఖరీదైన జైల్లు ప్రదర్శనలో రంగు వెంకటనారాయణ



మాజీ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా ఉత్తమ నంది అవార్డు అందుకుంటున్న వెంకటనారాయణ

లక్ష్యసాధనకు కృషి చేయాలి

బీర్‌పూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు, ఇంపాక్ట్ ట్రైనర్ రేకుంట రమేష్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డు రాదని అన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు సాయం అందించేవారు సమాజంలో చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. వ్యసనాలకు అలవాటు పడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, శ్రీకృష్ణ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఓగుల అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ విజయవంతం అయినట్లు రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ అన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. 225 మంది విద్యార్థులు నియామక ప్రక్రియలో తదుపరి దశలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, ప్లేస్‌మెంట్ అధికారి మల్లేశం, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రాయికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో వ్యవసాయ అవసరాల కోసం మంగళవారం 100 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. తక్షణ సహాయం, సమస్యల పరిష్కారానికి 1912 నెంబర్‌ను సంప్రదించాలని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో డీఈఈ రాజారెడ్డి, ఏడీఈ సింధూర్ శర్మ, ఏఈ నవీన్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల - వేములవాడ రోడ్డు మండలంలోని కలికోట నుంచి సిరికొండ శివారు దాకా గుంతలమయమై అధ్వాన్నంగా ఉందని మరమ్మతులు చేయించాలని మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్న సర్కారు రోడ్లను మెరుగు పరచడంపై శ్రద్ధ చూపడం లేదన్నారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపి రోడ్డు మరమ్మతు చేయించాలని కోరారు. డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం హరీశ్‌గౌడ్, జిల్లా కోకన్వీనర్ పాడేటి రమేశ్, గంగరాజం ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ

- ఎస్సెస్సీ విద్యార్థులకు 'ప్రత్యేక' తరగతులు
- ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి

కోరుట్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధిలోని పాఠశాలలతో మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ పరిధిలో, మండలంలో 18 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మండల విద్యాధికారి నరేశం ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తూ వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. 2025 మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు 714 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు అన్ని విధాలుగా సన్నద్ధమయ్యేందుకు కృషి చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా హాజరయ్యేందుకు సూచనలు ఇస్తున్నారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. అదనపు తరగతులు నిర్వహించే సమయంలో గ్రామాలకు చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్ అందించి చేయూతనిస్తున్నారు.



ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం-ఎంఈవో, నరేశం



పది పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధిస్తాం. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాం. క్రమశిక్షణ, ఏకాగ్రతను విద్యార్థులకు నేర్పిస్తున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం.

సబ్జెక్టులపై అవగాహన పెంచుకుంటున్నాం -విద్యార్థిని, నందిని



ప్రత్యేక తరగతులకు హాజరై ఆయా సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకుంటున్నాం. పరీక్షల్లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులు ప్రతి రోజు వివరిస్తున్నారు. ప్రత్యేక తరగతులతో పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది.

రైతు కూలీలకు న్యాయం చేయాలి



తహసీల్దార్ కృష్ణచైతన్యకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

ధర్మపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని రైతు కూలీలకు, చదువుకునే విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్‌లకు మంగళవారం వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షులు గాజు భాస్కర్ మాట్లాడుతూ ధర్మపురి మున్సిపల్ ఏర్పడిన తరువాత మున్సిపల్ చట్టం ప్రకారం రైతు కూలీలకు, విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ధర్మపురి పట్టణంలో చాలా మంది వ్యవసాయ రైతు కూలీలు ఉన్నారని, వారందరు పత్తి తీయడం కోసం, నాట్లు వేయడం కోసం పంట పొలాల పనులకు వెళుతుంటారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం స్వంత భూమి లేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ 12000 ఇస్తామని చెప్పడం జరిగిందని ఆయన తెలిపారు. చదువుకునే విద్యార్థులను కూడా కొన్ని వ్యవసాయానికి సంబంధించిన చదువులకు అనర్హులుగా ప్రకటించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, అసెంబ్లీ కో కన్వీనర్ బండారు లక్ష్మణ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు నలుమాసు వైకుంఠం, పల్లెర్ల సురేందర్, పట్టణ మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే నడపాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ కలిగి ఉన్న వాహనాలనే నడపాలని జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కొండగట్టులో మంగళవారం డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సడక్ సురక్ష అభియాన్ గురించి అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవాలని పేర్కొన్నారు. వాహనాలకు అన్ని రకాల పత్రాలు ఉండాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు

పశు వైద్య శిబిరం

ధర్మపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కొసునూర్‌పల్లె గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిచారు. వివిధ రకాల వ్యాధులకు చికిత్స దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. రైతులకు సబ్సిడీ ధరలో పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ దుంపల వేణుగోపాల్ పాడి రైతులకు పశు పోషణ, పశుగ్రాస పెంపకం, ఉపయోగాలు, ఖనిజ లవణ మిశ్రమం, ఆవశ్యకత, అధిక పాల దిగుబడి రావడానికి అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్, వెనుగుమట్ల, ధర్మపురి మండల పశు వైద్యాధికారులు డాక్టర్ సునీల్, డాక్టర్ తిరుపతిగౌడ్, డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు

మల్లాపూర్, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడంతో మల్లాపూర్‌లోని నాయకులు సంబరాలు జరిపారు. మంగళవారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ జీవితంలో ఎన్నడూ పదవులను ఆశించకుండా ప్రజలవైపు ఉండి సామాజిక ఉద్యమాలను నడిపారన్నారు. ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల మాదిగ సంఘాలు ఎంఆర్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లా బుచ్చయ్య, నూతిపల్లి రాజం, పెద్దిరెడ్డి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ

జగిత్యాల అర్బన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో బార్డర్ ప్రొటక్షన్ విభాగంలో జరిగిన సైన్స్ ఫేర్‌లో జాతీయ స్థాయిలో రెండవ బహుమతి పొందిన దరూర్ మౌంట్ కార్మెల్ పాఠశాల విద్యార్థి సిహెచ్ మణిదీప్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మంగళవారం అభినందించారు. అందుకు ప్రోత్సాహం అందించిన గైడ్ టీచర్ బెజ్జారపు కవిత, ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతీష్ మరియా, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌లను ఎమ్మెల్యే అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జగిత్యాల అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బేటీ పడావో- బేటీ బచావో కార్యక్రమం ప్రారంభించి 10 సంవత్సరాలు అయిన సందర్భంగా ఏర్పాటు చేస్తున్న దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్, సంక్షేమాకారి నరేష్, ఇంటర్ మీడియట్ విద్యాధికారి నారాయణ, ఎస్సీ సంక్షేమాధికారి రాజ్ కమార్, ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పీఆర్సీని ప్రకటించాలి



సభ్యత్వ నమోదు రసీదు అందిస్తున్న ఆర్‌యుపీపీటీ నాయకులు

కోరుట్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు 60 శాతంతో కూడిన పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను వెంటనే ప్రకటించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర శాఖ ఆధ్యక్షుడు వేల్పాల స్వామి యాదవ్ అన్నారు. మంగళవారం మండంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వంను అందించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్షుడు కటకం నరేందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు అన్నారంబట్ల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సంపతి నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ కటుకోజ్వల మనోహరచారీ, శ్రీధర్, శ్రీనివాస్, రాంమెహన్, శ్రీనివాస్ స్వామిలు పాల్గొన్నారు.

'బీసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి'

మల్లాపూర్, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి) : పాలక వర్గం బీసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని భారతమాత కూడలి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల మల్లాపూర్‌లో జరిగిన ప్రాజపాలన గ్రామసభలో చోటు చేసుకున్న సంఘటన పట్ల బీసీలపై అట్రాసీటి కేసు పెట్టిన కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరును ఆయన నిర్వహించిన సమావేశంలో ఎండగట్టారు.

బేషరతుగా కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం అన్నారు. పాలక పక్షం బీసీ బిడ్డలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలని అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను విమర్శిస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మంత్రి ఉత్తమ్ కుమార్‌ను విమర్శించే స్థాయి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కు లేదని, అలా చేస్తే ఊరుకోమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి కృష్ణారావు మాట్లాడారు. రాష్ట్ర మంత్రికి టీఎంసీ అంటే తెలువదని స్థానిక ఎమ్మెల్యే అనడం విడ్డూరమని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, అతని తండ్రి విద్యాసాగర్ రావు ఏప్పులు ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, తిరుమల గంగాధర్, ఎంఏ నయిం, సత్యనారాయణ గౌడ్, పుప్పాల ప్రభకర్, ఎండేరి సత్యనారాయణ, లింబాద్రి, తోట గంగాధర్, సోగ్రబీ, లక్ష్మణ్, దశరథంలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సింగాపూర్, దావోస్ పర్యటనను పూర్తి చేసుకొని వచ్చిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిలు కలిసి సత్కరించారు. దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి రూ. 1.79 లక్షల కోట్లు పెట్టుబడులను సాధించుకొని రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి శ్రీధర్ బాబును ఘనంగా సన్మానించారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తమ ఇళ్ల మధ్య సెల్‌టవర్ వద్దని, మరో చోట ఏర్పాటు చేసుకోవాలని మల్యాల కొత్తపేట వాసులు టెలికం శాఖ అధికారులకు తేల్చి చెప్పారు. ఇటీవల కొత్తపేట ప్రాంతంలోని ఓ ఇంటిపై ప్రైవేట్ సెల్ కంపెని సెల్‌టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో స్థానికులు గ్రామ పంచాయితీ అధికారులకు తమ ఇళ్లలో టవర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దని వినతిపత్రం అందజేశారు. అయినప్పటికీ కొంత మేర పనులను అర్ధరాత్రి వేళ చేపట్టడంతో మరోసారి ఫిర్యాదు చేశారు. అధికారులు సర్దిచెప్పినప్పటికీ స్థానికులు టవర్ ఏర్పాటు వద్దు.. వద్దు అంటూ గట్టిగా చెప్పారు. దీంతో అధికారులు వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ టెలికం డైరెక్టర్ ఏ.శ్రావన్‌కుమార్, ఏడీజీ వి. అరున్‌కుమార్, ఎంపీడీవో స్వాతి, పంచాయితీ ఈవో శ్రీకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు

నర్సరీలను పరిశీలించిన డీఆర్డీవో

మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల, మానాల, సర్వాపూర్‌లో మంగళవారం డీఆర్డీవో నర్సరీ, పశువుల పాకలు పరిశీలించారు. నర్సరీల్లో ఈత మొక్కలను పెంపకం మరింతగా పెంచాలని సూచించారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, టీఏ లావణ్య, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



రంగపేట పాఠశాలలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ధర్మపురి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రీబ్యూటర్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ జగిత్యాల జిల్లా కార్యదర్శి బండారి సతీష్ అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ యూనిఫైడ్ పెన్షన్ విధానంపై జారీ చేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ ధర్మపురి మండలంలోని రాజారం ప్రభుత్వ పాఠశాలలో టీఎస్‌సీపీఎస్‌ఈయు ఆధ్వర్యంలో యూపీఎస్ వద్దు అని రాసిన ప్రతులతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలం నుండి తీవ్ర పోరాటం చేస్తుంటే ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి ఈ యూపీఎస్ విధానం తీసుక రావడం అప్రజాస్వామికమని అన్నారు. ఇది కేవలం షేర్ మార్కెట్లోకి నిరంతరాయంగా పెట్టుబడులు పెట్టే విధానంగా ఉందే తప్ప, ఈ విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబ సామాజిక భద్రత కోణం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ విధానాన్ని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయు రాష్ట్ర నాయకులు మ్యాన పవన్‌కుమార్, సందారికారి రాజేష్, చల్ల కృష్ణ, చుంచుకాల శ్వేతరాణి, స్వప్న, రేణుక, మమత, ఆసిఫ్, బేగ్, రాజేష్, మహేష్, అనిత, సునీత, సింధూజ తదితరులు పాల్గొన్నారు. వారికి మద్దతుగా సీనియర్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వెంకటరమణ, జనార్ధన్, రాజన్న, నరహరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

●సారంగాపూర్: సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విదానంను పునఃరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కంట్రీ బ్యూటరీపెన్షన్ స్కీం ఎంప్లాయిస్‌యూనియన్ జిల్లా అధ్యక్షులు గంగాధరి మహేష్ డిమాండ్ చేశారు. మంగలవారం మండలంలోని రంగపేట జిల్లా పరిషత్ పాఠశాలలో యూనియన్ ఆధ్వర్యంలో యూపీఎస్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్‌ఈయు నాయకులు జనార్ధన్, బోగ శ్రీనివాస్, బండారి, సతీష్, సిర్ర శ్రీనివాస్, పెద్దూరి శంకర్, కొత్త వంశీ, ప్రవీణ్, నరేష్, సాయిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●కథలాపూర్ : పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని సీపీఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం విధానం తీసుకురావడం శోచనీయమని సీపీఎస్ సంఘ మండల ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి సాయిరెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని బొమ్మెన ప్రాథమిక పాఠశాలలో యుపీఎస్ విధానంపై జారీ చేసిన నోటిఫికేషన్‌ను నిరసిస్తూ ఆ గెజిట్ ప్రతులను దహనం చేశారు.ఈ సందర్భంగా అంబటి రవి, రమేశ్, శివకృష్ణ ఉన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

రాయికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కొలగాని నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత స్థితికి ఏ విధంగా ఎదగాలి, ఏ విధంగా చైతన్యం కావాలో వివరించారు. ఎంఈవో శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, సత్యనారాయణ, అలీ రాజా, సామల గంగాధర్, పారిపెల్లి గంగాదర్, శ్రీకాంత్, శివానందం, పద్మజ, తిరుమల పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నూతనంగా మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్యాల మారుతిని మంగళవారం బీజేపీ నాయకులు సన్మానించారు. శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల బీజేపీ నాయకులు ఉన్నారు.

'కేంద్ర మంత్రి క్షమాపణ చెప్పాలి'



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడిమ్యాల, జనవరి28(ఆంధ్రజ్యోతి) : కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బాధ్యతతో మాట్లాడాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకడు గాజుల అజయ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఇందిరాగాంధీ, గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టి బొమ్మ యూత్ కాంగ్రెస్ నాయకులు దహనానికి ప్రయత్నం చేయుచుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, అజయ్, సాయికుమార్, చంద్రమోహన్‌రెడ్డి, జలెందర్, జితెంరెడ్డి, నరేష్, కళ్యాన్, సాయి పాల్గొన్నారు.

●మల్యాల, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ, గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మల్యాలలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, కట్కం వినయ్, శ్రీకోటి శ్రీకాంత్, కిషన్‌రెడ్డి, అనిల్, పృథ్వీరాజు పాల్గొన్నారు.

●కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గద్దర్‌ను నక్సలైట్‌గా మాత్రమే చిత్రీకరించి బీజేపీ తన నైజాన్ని నిరూపించుకుందని విమర్శించారు. కార్యక్రమంలో రేహాన్, ముదాం శేఖర్ ఉన్నారు.

అపరాల సాగుపై అవగాహన

కొడిమ్యాల, జనవరి28(ఆంధ్రజ్యోతి) మండలంలోని పూడూర్ గ్రామ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్ర వేత్తలు అపరాల సాగుపై రైతులకు అవగాహన కలిపించారు. అపరాల సాగుపై ఉన్న సందేహాలను రైతులు శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి, ఏఈవోలు రాజేష్, శ్రీలత, గ్రీష్మ, ప్రశాంత్ రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాగ్ డే

రాయికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో మంగళవారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, ఆసక్తిని కలిగించే క్విజ్, ఉపన్యాసాలు, వివిధ రకాలైన ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచుతూ ఉల్లాసపూరిత వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని తెలుపుతూ ఎస్‌ఈఆర్‌టీ అధికారులు రూపొందించిన పుస్తకాన్ని అనుసరించి పలు కార్యక్రమాలను అమలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, పాఠశాల డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, రంజిత్ పాల్గొన్నారు.

భూమి కేటాయింపు పత్రం అందజేత

కథలాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గ్రంథాలయం కోసం మంగళవారం రెవెన్యూ అధికారులు మూడు గుంటలు కేటాయిస్తూ సంబంధిత శాఖ అధికారులకు పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమి సర్వే చేసి భూమి కేటాయింపు పత్రం కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి శంకర్‌కు అందించామని ఆర్ఐ నగేశ్ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్లాపూర్, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయం ఆవరణలో అఖిల భారత యాదవ మహా సభ క్యాలెండర్‌ను యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారంయాదవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ మహాసభ నాయకులు లక్కం మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.